క్లుప్తంగా

వీరేశ్వరుని సన్నిధిలో పుదుచ్చేరి ఎస్ఎస్పీ



వీరేశ్వరుని సన్నిధిలో ఎస్ఎస్పీ నర్రా చైతన్య

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని పుదుచ్చేరి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్పీ) నర్రా చైతన్య దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో సిబ్బంది, అర్చకులు, పండితులు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఓడలరేవు గ్రామస్తులకు సంక్రాంతి కానుకల పంపిణీ



సంక్రాంతి కానుకలను అందిస్తున్న సర్పంచ్ మంగాయమ్మ, ఓఎన్జీసీ అధికారులు

అల్లవరం: ఓఎన్జీసీ కాకినాడ ఏసెట్ ఆధ్వర్యంలో ఓడలరేవు గ్రామ ప్రజలకు సంక్రాంతి కానుకలను గురువారం అందజేశారు. సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సచివాలయం ఆవరణలో ఓఎన్జీసీ సమకూర్చిన కుక్కర్లు, దుప్పట్లు, ఎనిమిది రకాల నిత్యావసరాలను 1450 కుటుంబాలకు పంపిణీ చేశారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంక్రాంతి కానుక అందించామని సర్పంచ్ మంగాయమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్జీసీ అధికారి సుమంత్, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి ఉమామహేశ్వరరావు, చొల్లంగి రాధాకృష్ణ, మధుర కుమారస్వామి, పెచ్చెట్టి నరసింహరాజు, శేఖర్, అవనిగడ్డ శేషగిరిరావు, పోతుల మురళి, పెచ్చెట్టి బాబ్జి, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్

అమలాపురం రూరల్: జిల్లాలో భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ నూతన కమిటీని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రంబాల సతీష్ అధ్యక్షతన ఈదరపల్లిలో గురువారం ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శిగా ముత్తబత్తుల నాగమణి, కమిటీ సభ్యులుగా కొట్టాల వెంకటరెడ్డి, మద్ద అనంతలక్ష్మి, చెయ్యావరపు పద్మావతి, కొట్టాల అనంతలక్ష్మి, బండి దుర్గా ప్రవీణ్, కొట్టాల అనిల్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి రంబాల సతీష్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

రేపు హుండీల లెక్కింపు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న హుండీల లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు.

మనో వికాస కేంద్రంలో పండ్ల పంపిణీ

అమలాపురం రూరల్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు ఈదరపల్లిలో హరి మనోవికాస కేంద్రంలో పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు రుద్రరాజు క్రమశిక్షణ కలిగిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, ముషణి రామకృష్ణరావు, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

ఐ.పోలవరం: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని జి.మూలపొలంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురమళ్ల పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, చింతా శంకరమూర్తి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఆర్బీకేలు

- అడుగడుగునా ప్రభుత్వ సహకారం
- రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు



గోపవరంలో నాట్లు తీస్తున్న రైతులు

ఉప్పలగుప్తం: వ్యవసాయం దండగ అన్నది నాటి పాలకుల మాట. వ్యవసాయం పండగన్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాట. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రధానంగా ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు కొండంత అండగా నిలబడుతున్నాయి. విత్తనం, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందించటంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నారు.

రబీ నేపథ్యంలో అమలాపురం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, తాళ్లరేవు, అల్లవరం తదితర మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. రైతులు గత నెలలో సంభవించిన మిచాంగ్ తుపాను నేపథ్యంలో కొన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నా ప్రభుత్వ సహకారంతో గట్టెక్కి రబీ సాగుకు సిద్ధమయ్యారు. రబీ పనులు ప్రారంభం కావడంతో ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రతీ ఆర్బీకేలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సిద్ధం చేశారు. ఆర్బీకేల్లో రాయితీపై వ్యవసాయ పనిముట్లను సైతం అందిస్తున్నారు. ఇటీవల మిచాంగ్ తుపాను సమయంలో నారుమడులు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీతో విత్తనాలను అందించింది.

రైతు ముంగిటకు సేవలు

రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని నమ్మిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ సహాయకుల్ని అందుబాటులో ఉంచారు. రైతులకు అడుగడుగునా సహకారాన్ని అందిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నారు. నారు వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకూ రైతులకు అండదండగా నిలుస్తున్నారు. ఈ-పంట ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పండించిన పంటకు గిట్టుబాటు. ధరలను పక్కాగా అమలుచేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-పంట నమోదు, రైతు భరోసా, పీఎం కిసాన్, సున్నా వడ్డీ రాయితీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, మట్టి నమూనా పరీక్షలు తదితర సేవలను అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఈ-క్రాప్ ఆధారంగా నష్టపరిహారం అందజేస్తున్నారు.

మునుపెన్నడూ ఈ సేవలు చూడలేదు



నేను ఐదెకరాల్లో సాగు చేస్తున్నాను. మిచాంగ్ తుఫానుకి నారుమడి మునిగిపోతే నాకు 80 శాతం రాయితీపై విత్తనాలను ఆర్‌బీకేలో అందించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్‌బీకేల్లో సమయానికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు అందిస్తూ సాగును లాభదాయకంగా మారుస్తున్నారు. ఇలాంటి సేవలు మునుపెన్నడూ ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు.

– మెట్ల ఈశ్వరరావు, కౌలు రైతు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

ఆర్బీకేలతో ఎంతో మేలు



ఆర్బీకేల రాకతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతీ ఆర్‌బీకేల పరిధిలో స్థానిక రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు రాయితీపై విత్తనాలను అందించాం. రైతులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా మా సిబ్బంది పనిచేస్తున్నారు.

– జి.కుమార్‌బాబు, ఏఓ, ఉప్పలగుప్తం మండలం

23న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి అమలాపురం ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తామని కోనసీమ జిల్లా ఉపాధి కల్పనాధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైనావారికి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం ఇస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి కోరారు. మరిన్ని వివరాల కోసం 81218 38392 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రీడలు

అంబాజీపేట: యువతీ, యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాలను సాధించాలి



అమలాపురంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి



తాళ్లరేవులో శిక్షణకు హాజరైన అధికారులతో ఎంపీపీ సునీత తదితరులు

అమలాపురం రూరల్: గ్రామ స్థాయిలో ప్రజల అభివృద్ధి సూచిక, సుస్థిర లక్ష్యాలను సాధించడంలో సర్పంచ్ ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో నిర్వహించే అభివృద్ధి పనులకు 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి, సర్పంచ్‌లు దాసరి అరుణ, గంగుమళ్ల ఏసుబాబు, గుత్తుల చిరంజీవి, కార్యదర్శులు రుద్రరాజు సూరపరాజు, రాజేశ్వరరావు, ధనలక్ష్మి, రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

అల్లవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లోని ఫ్రంట్ లైన్ వర్కర్లకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన రెండో రోజు శిక్షణ అందించారు. గురువారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఫ్రంట్ లైన్ వర్కర్లు గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శులు సంయుక్తంగా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా ప్రణాళిక రచించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఏపీఎం సయ్యద్, ఎంఈఓ-2 ఏడుకొండలు, పరిపాలనాధికారి లక్ష్మణరావు, కార్యదర్శులు శ్రీనివాస్, రాజ్‌మోహన్, సత్యనారాయణ, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

ముగిసిన శిక్షణ కార్యక్రమం

తాళ్లరేవు: గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి అధికారులకు నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.అనుపమ అధ్యక్షతన రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ఆయా ప్రజాప్రతినిధులు చేసిన ప్రతిపాదనలను జిల్లా స్థాయి అధికారులకు నివేదించి దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి

ఉప్పలగుప్తం: గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా పంచాయతీ, సచివాలయాల సిబ్బంది ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు జిన్నూరి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామచంద్రరావు, కుంచే బుల్లియ్య, చిట్టికుమారి, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..

25 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు

ఉప్పలగుప్తం: వారంతా చిన్ననాటి స్నేహితులు.. 25 ఏళ్ల క్రితం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్నారు. జీవన గమనంలో వృత్తి వ్యాపారాల రీత్యా దేశవిదేశాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 1997–98లో పదో తరగతి చదువుకున్న వారంతా రెండున్నర దశాబ్దాల తరువాత గురువారం తిరిగి తమ పాఠశాలలో అందరూ కలుసుకున్నారు. స్నేహమేరా జీవితం .. స్నేహమేరా శాశ్వతం అంటూ రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఒక్కసారిగా బాల్యంలోకి వెళ్లిపోయారు. కొందరైతే పాఠశాల రోజుల్లోని మధుర స్మృతులను తలచుకుని ఆనందభాష్పాలు రాల్చారు. ఆనాటి తరగతుల్లో కూర్చుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. తమతో పాటు చదువుకుని ఆర్థికంగా వెనకబడిన స్నేహితులకు చేయూతనివ్వాలని కలిసికట్టుగా తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ కలయికకు కృషి చేసిన పూర్వ విద్యార్థులు కోడూరి పల్లంరాజు, నాగిరెడ్డి రాంబాబు, నిమ్మకాయల లల్లీ, సుందరనీడి నాగేశ్వరరావు, సలాది తాతారావు, మారిశెట్టి నాగకృష్ణమూర్తి, మట్టపర్తి లలిత, సుందరనీడి నళిని, విత్తనాల నాగభూషణం, వీరవల్లి నాగదుర్గాప్రసాద్‌లను స్నేహితులు, గురువులు అభినందించారు.

గ్రామకంఠం సమస్యకు శాశ్వత పరిష్కారం

కొత్తపేట: సాంకేతిక సమస్యల కారణంగా పలివెల, బిళ్లకుర్రు గ్రామాల గ్రామ కంఠం భూములు దేవదాయ-ధర్మదాయ శాఖ ఆస్తులుగా నోటీపై కావడంతో ఎంతో కాలంగా సదరు ఆస్తులు అమ్ముకోవడానికి వీలుపడక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తుల సమస్యను గ్రామస్తులు, ఎంపీపీ మార్గాన గంగాధరరావులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత దేవదాయ శాఖ అధికారులతో, ప్రభుత్వంతో తరచూ మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఫలితంగా ఈరోజు ఈ గ్రామ కంఠం సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం జరిగింది. గతంలో కూడా కొత్తపేట, వానపల్లి, వాడపాలెం గ్రామాల ప్రజలు ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నప్పుడు ఎమ్మెల్యే చొరవ చూపించి పరిష్కరించారు. ఈ విధంగా సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించి, వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పని చేసే నాయకులు చాలా అరుదుగా ఉంటారని జగ్గిరెడ్డి ఆ కోవలోకే వస్తారన్నారు. ప్రతిపక్షాలు ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే నాయకులపై పనికిమాలిన విమర్శలు చేయడం, ఉత్తర ప్రగల్భాలు పలకడం, కుట్రలు, కుతంత్రాలు చేయడం, ప్రతి విషయాన్ని రాజకీయంగా ఎలా వాడుకోవాలి అని చూస్తున్నారే తప్ప వేరే పని ఏమి ఉండడం లేదని విమర్శించారు.



బిళ్లకుర్రు ప్రజలకు జీవో కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

చిరుధాన్యాల ఉత్పత్తిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న మార్టేరు వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ భరతలక్ష్మి

అయినవిల్లి: మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉత్పత్తిపై గురువారం అవగాహన కార్యక్రమం మండలంలోని మాగాంలో నిర్వహించారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ భరతలక్ష్మి, సైంటిస్ట్ సుధీర్, పెద్దాపురం, ముమ్మిడివరం ఏరువాక కేంద్రం నుంచి వి.గౌరీ, బి.భవానీల ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. భరతలక్ష్మి చిరుధాన్యాల ఉత్పత్తులపై ఇప్పుడు మంచి గిరాకీ ఉందని రైతులు వీటి సాగుపై మెళకువలు తెలుసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో మంచి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. నేటి యువతరం రైతులు చిరు ధాన్యాలను సాగు చేయాలని ఆమె కోరారు. రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగు అనుకూలమన్నారు. చిరుధాన్యాలను ఆశించే చీడ పీడలపై యాజమాన్య పద్ధతులు, సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు ప్రదీప్‌కుమార్, జిల్లా వనరులు శాఖ ఏడీఏ ఎ.రాజశేఖర్, ఏఓ మనోహర్, ఏడీఏ ఎంఏ శంషీ, ఏవో శోభ, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బాలయోగి ఘాట్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ముమ్మిడివరం గేట్, గవర్నమెంట్ హాస్పిటల్, విద్యుత్‌నగర్, సావరం, ఆర్డీవో ఆఫీస్ రోడ్, నల్లవంతెన, కలెక్టర్ ఆఫీస్, రూరల్ మండలంలోని జనుపల్లి, ఎ.వేమవరం, అయినవిల్లి మండలంలోని మాగం, నేదునూరు ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

తిరుగు పయనం.. పోటెత్తిన జనం..

- ప్రయాణికులతో పోటెత్తిన అమలాపురం బస్టాండ్
- దూర ప్రాంతాలకు 130 ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్: సంక్రాంతి సెలవులకు దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు తిరుగు పయనమవడంతో గురువారం అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో పోటెత్తింది. హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు అమలాపురం బస్‌స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద బారులు తీరారు. బుధవారంతో పండగ ముగియడం, శుక్రవారం రోజున ప్రయాణాలు చేయకూడదనే నమ్మకాలు ఉండడంతో ఎక్కువమంది గురువారమే ప్రయాణాలు పెట్టుకున్నారు. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటుచేసినా రద్దీ తగ్గలేదు.

దూర ప్రాంతాల ప్రయాణికుల కోసం ఆర్టీసీ 130 ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. హైదరాబాద్‌కు రోజూ 11 బస్సులు వెళుతుండగా రద్దీని దృష్టిలో పెట్టుకుని మంగళవారం 15, బుధవారం 15, గురువారం 15, శుక్రవారం 6, శనివారం 6, ఆదివారం 10 అదనపు బస్సులు ఏర్పాటుచేశారు. మొత్తంగా ఒక్క హైదరాబాద్‌కే 70 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. విజయవాడ, విశాఖపట్టణానికి రోజుకు ఇప్పటివరకూ 12 బస్సులు నడుస్తుంటే విజయవాడకు అదనంగా 30, విశాఖపట్టణానికి మరో 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆదివారం వరకూ అమలాపురం నుంచి దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ డీఎం చల్లా సత్యనారాయణమూర్తి చెప్పారు.



అమలాపురం బస్టాండ్‌లో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద రద్దీ



అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు

ఆర్టీసీ అదనపు బస్సుల్లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై గత టీడీపీ ప్రభుత్వంలో భారీగా అదనపు వడ్డన పడేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం అదనపు చార్జీలను రద్దు చేశారు. సాధారణ రోజుల్లో మాదిరిగానే సంక్రాంతి, దీపావళి, ఉగాది తదితర పండగల్లో ప్రత్యేక బస్సులకు సైతం హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీలో రూ.900 అల్ట్రాడీలక్స్ రూ.860, ఏసీ రూ.1140, ఎక్స్‌ప్రెస్ రూ.700 వసూలు చేస్తున్నారు. ఇదే సమయంలో అమలాపురం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రైవేటు హైటెక్ బస్సుల్లోనైతే అప్పటికప్పుడు టికెట్ బుక్ చేసుకున్నవారికి సాధారణ టికెట్ రూ.1,800 నుంచి రూ.2,000 వరకూ వసూలు చేస్తున్నారు. అదే ఏసీ బస్సులైతే ఏకంగా రూ.3,000 వరకూ పిండేస్తున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

మామిడికుదురు: మొగలికుదురు శివారు బడుగువారిపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బడుగు వెంకటరమణ ఇల్లు అగ్నికి ఆహుతయింది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు, గృహోపకరణాలు అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేల నగదును బాధితుడు వెంకటరమణకు అందజేసి అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కడి శ్రీనివాస్, కొప్పిశెట్టి హేమసుందర్, తాడి శేఖర్, సిర్రా వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల మధువాసన్, కారుపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు నిలుపుదాం

మామిడికుదురు: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు నిలపడం ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో కోనసీమ బ్లడ్ డోనర్స్ నాలుగో వార్షికోత్సవ వేడుకను అధ్యక్షుడు కాండ్రేగుల నరేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 60 మంది రక్తదానం చేశారు. ఈ బ్లడ్ మొత్తాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు, బుద్దాల నాగరత్నం బ్లడ్ బ్యాంకునకు అందించినట్లు నరేంద్ర, టీమ్, గ్రూప్ సభ్యులు తెలిపారు.